క్లుప్తంగా

రాజ్యాంగం పుస్తక ప్రదర్శన

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో బుధవారం 10వ రోజు విజ్ఞాన శిబిరం కొనసాగింది. ఐక్య వేదిక జిల్లా కార్యదర్శి ఎల్ఎస్ భాస్కరరావు భారత రాజ్యాంగం పుస్తక ప్రదర్శనతో పాటు రాజ్యాంగ పీఠిక(ప్రియాంబుల్) ఫ్లెక్సీ, బ్యానర్లు ప్రదర్శించి విద్యార్థులతో చదివించారు. ఐక్య వేదిక మండవల్లి శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. గ్రంథపాలకురాలు షేక్ పర్వీన మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఐక్య వేదిక మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



ముదినేపల్లి రూరల్ : వేసవి విజ్ఞాన శిబిర నిర్వహణలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రంథాలయాధికారి ఎస్.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. చెస్, క్యారమ్స్ వంటి ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నీతికథల పుస్తకాలు పంపిణీ చేసి విద్యార్థులతో పఠనం చేయించారు.

కానుకొల్లులో చెరువు అభివృద్ధి పనులు



మండవల్లి: మండలంలోని కానుకొల్లు గ్రామంలో బుధవారం ఉపాధి హామీ పథకం కూలీలు చెరువు అభివృద్ధి పనులు నిర్వహించారు. రూ.7 లక్షల నిధులతో పనులు నిర్వహిస్తున్నట్టు ఎంటీఏ నవీన్ తెలిపారు. 150 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పనుల ద్వారా కూలీలకు ఉపాధి లభించటమే కాక, రైతుల సాగునీటి సమస్యలు పరిష్కారమవుతున్నాయని తెలిపారు.

వైఎస్సార్ బీమా పథకంలో రూ.10 వేలు అందజేత



మండవల్లి: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా రూ.10 వేలు అందజేశారు. ఇటీవల మృతి చెందిన పెనుగొండ ఇజ్రాయిల్ కుటుంబానికి సర్పంచ్ బేతపూడి యేసోబురాజు ఆధ్వర్యంలో బుధవారం ఈ నగదు అందజేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ముదినేపల్లిరూరల్: అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందిన వ్యక్తి అంత్యక్రియలకు వైద్య విద్యార్థిని బుధవారం ఆర్థిక సాయం అందించింది. స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన బలే చంద్రశేఖర్ బుధవారం అనారోగ్యంతో మరణించాడు. సమాచారం తెలుసుకున్న వైద్యుడు అంబుల మనోజ్ కుమార్తె, వైద్య విద్యార్థిని వైష్ణవి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేలు సాయం అందజేసింది.

అస్వస్థతతో వ్యక్తి మృతి

తోట్లవల్లూరు: ఎండల ధాటికి అస్వస్థతకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన తోట్లవల్లూరులో జరిగింది. గ్రామంలోని కనకదుర్గమ్మ కాలనీకి చెందిన ఓలేటి మురళి (55) బుధవారం బ్యాండు మేళం పనికి వెళ్లాడు. తోట్లవల్లూరు సెంటర్ నుంచి మధ్యాహ్నం సమయంలో కనకదుర్గమ్మ కాలనీకి తిరిగి వస్తూ మార్గంమధ్యలో స్పృహ తప్పి పడిపోయినట్లు స్థానికులు తెలిపారు.

రేపు తోట్లవల్లూరు మండల సమావేశం

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న జరుగుతుందని ఎంపీడీఓ తుంగల స్వర్ణలత తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు.

శరవేగంగా ఆర్బీకేల నిర్మాణం

- గుడివాడ నియోజకవర్గంలో 38 రైతు భరోసా కేంద్రాలు
- 38 ఆర్బీకే భవనాల నిర్మాణానికి రూ.8.28 కోట్లు
- ఇప్పటికే 14 భవనాలు పూర్తి..వివిధ దశల్లో 24 భవనాలు



నందివాడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం

గుడివాడరూరల్: రైతు సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం. ఆమేరకు ప్రభుత్వం నిర్ణయించిన సేవలు గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంచేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు ఈ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ కేంద్రాల నిర్వహణకు శాశ్వత భవనాలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనాలు కొన్ని ఇప్పటికే పూర్తికాగా మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.

ప్రయోజనాలివీ..

మండల కేంద్రాలకు కూడా వెళ్లే పరిస్థితి లేకుండా ఎవరి గ్రామంలో వారు వ్యవసాయరంగ సేవలను పొందొచ్చు. ప్రతి ఆర్బీకే సెంటర్‌లో రైతు సహాయకులను నియమించి సాగు విషయంలో సలహాలు, సందేహాలను నివృత్తి చేసే విధంగా సిబ్బందిని నియమించారు. ధాన్యం ఆర్బీకేల నుంచే కొనుగోలు, ఎరువులు, పురుగు మందులు ఇలా అన్నీ చేసే విధంగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడంతో రైతన్నలకు మేలు జరిగింది.

38 ఆర్బీకేలు రూ.8.28 కోట్లు..

గుడివాడ నియోజకవర్గంలో 38 ఆర్బీకే భవనాల నిర్మాణానికి రూ.8.28కోట్ల నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ సత్వరమే పూర్తి చేయడంతో నిర్మాణాలు వేగంగా పూర్తవుతున్నాయి. గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలకు 38 రైతు భరోసా కేంద్రాలకు సొంత భవనాలు సిద్ధమవుతున్నాయి. ఒక్కో భవనానికి ప్రభుత్వం రూ.21.8 లక్షలు మంజూరు చేసింది. 38 భవనాలకు గాను ఇప్పటికి 14 పూర్తిగా మిగిలిన 24 భవనాలు నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

రూరల్ మండలంలో..

గుడివాడ రూరల్ మండలంలో 9 ఆర్బీకే నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా బిళ్లపాడు, దొండపాడు, లింగవరం, మల్లాయపాలెం-2 భవనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. చౌటపల్లి, కల్వపూడి అగ్రహారం, రామనపూడి గ్రామాల్లో భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. మోటూరు, శేరీగొల్వేపల్లి గ్రామాల్లో భవనాల నిర్మాణాలకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నందివాడ మండలంలో..

నందివాడ మండలానికి సంబంధించి 12 భవనాలకుగాను ఇలపర్రు, పెదలింగాల, తుమ్మలపల్లి గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. అనమనపూడి, పుట్టగుంట, కుదరవల్లి గ్రామాల్లో భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అరిపిరాల, జనార్దనపురం, నందివాడ, పోలుకొండ, రుద్రపాక, తమిరిశ గ్రామాల్లో భవన నిర్మాణాలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గుడ్లవల్లేరు మండలంలో 17 భవనాల నిర్మాణాలకు గాను చంద్రాల, డోకిపర్రు-2, గుడ్లవల్లేరు-2, కౌతవరం-1, పురిటిపాడు, వడ్లమన్నాడు, విన్నకోట గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. అంగలూరు, డోకిపర్రు-1, కౌతవరం-2, శేరీకల్వపూడి, వెణుతురుమిల్లి గ్రామాల్లో భవన నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. గుడ్లవల్లేరు-1, కూరాడ, పెంజెంద్ర, శేరీదగ్గుమిల్లి, వేమవరం గ్రామాల్లో భవన నిర్మాణ పనులకు సాంకేతిక సమస్యల కారణంగా ఆలస్యమవుతున్నాయి.

ఆర్బీకేలు రైతులకు వరం..



గత ప్రభుత్వాల హాయంలో రైతులను పట్టించుకున్న నాథుడే లేడు. సలహాలు, సూచనలు చేయాలన్నా మండల కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆర్బీకే సెంటర్ల పుణ్యమా అంటూ రైతుల వద్దకే రైతు సేవలు వచ్చాయి. మరోమారు రైతుపక్ష పాతి జగన్మోహన్‌రెడ్డికే రైతుల మద్దతు.

–కైలే అశోక్‌కుమార్, రైతు, తటివర్రు

త్వరలో అందుబాటులోకి అన్ని భవనాలు..



గుడివాడ నియోజకవర్గంలో ఆర్బీకే భవన నిర్మాణాల విషయంలో నాణ్యతా ప్రమాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వం ఆర్బీకేల నిర్మాణాల విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేస్తాం. రైతులకు భవన నిర్మాణాలను త్వరలోనే అందుబాటులోకి తెస్తాం.

–డి.హరనాథ్‌బాబు, డీఈ, పంచాయతీరాజ్

ఆక్వా అభివృద్ధికి ఎంతో కృషిచేశాం

ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: ఆక్వా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ రాష్ట్ర ప్రభుత్వం చెయ్యలేని విధంగా నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. పట్టణంలోని బైపాస్ రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆక్వా ట్రేడర్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్వా రైతులను ఆదుకునేందుకు చిన్న రైతులకు విద్యుత్ వాడకంలో 50 శాతం రాయితీ ఇచ్చిందన్నారు. దీంతో రైతుకు ఏడాదికి కనీసంగా రూ.1.5 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ప్రతి ఏటా మేలు జరుగుతుందన్నారు. దీంతో రైతుకు సాగుభారం తగ్గుతుందనే ఆశతో ఎక్కువ మంది ఆక్వా వైపు మొగ్గు చూపుతారన్నారు. తద్వారా ఆక్వా ఎగుమతులు పెరిగి, రైతుకు మేలు జరగడంతో పాటు రాష్ట్రానికి ఆదాయం కూడా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆక్వా ట్రేడర్స్ చైర్మన్ పాతపాటి సర్రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు, దత్తాబయో మెడికల్ జీఎం కృష్ణంరాజు, ఆక్వారైతు సంక్షేమ సంఘం నాయకులు గురురాజు, ఉదయభాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్ కుమార్ అన్నారు. తన నివాస గృహంలో బుధవారం ప్రజల నుంచి సమస్యల అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. ప్రజలు తమకు ఇళ్ల స్థలాలు, నివాస గృహాలు, అంతర్గత రహదారులు ఏర్పాటు చేయాలని, తాగునీటి ఇబ్బందులు పరిష్కరించాలని, జగనన్న కాలనీలలో సైట్ లెవెలింగ్‌లు, కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ అర్జీలను అందజేశారు. ఆయా సమస్యలను ఎమ్మెల్యే పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని గ్రామాల్లో అంతర్గత రహదార్ల ఏర్పాటుకు అంచనాలు వేయించామని చెప్పారు. జగనన్న కాలనీలకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీలలో ఉన్న సమస్యలను సత్వరమే పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం తగు విధంగా పని చేస్తోందని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అన్నారు. అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పామర్రు, తోట్లవల్లూరు, మొవ్వ, పమిడిముక్కల, పెదపారుపూడి మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇప్పిస్తా... ధైర్యంగా ఉండండి



సమస్యలు వివరిస్తున్న బార్బర్ షాపు యజమానులు

గుడివాడటౌన్: ఫ్లై ఓవర్ నిర్మాణం, సర్వీస్ రోడ్ల ఏర్పాటు పనులలో భాగంగా రోడ్ల పక్కన నిర్వహిస్తున్న బార్బర్ షాపులు తొలగించడంతో తీవ్రంగా నష్టపోయామని బార్బర్ షాపుల నిర్వాహకులు ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) దృష్టికి తెచ్చారు. బుధవారం ఆయన నివాసంలో షాపు యజమానులు కలిసి జరిగిన నష్టాన్ని వివరించారు. ప్రజల సంక్షేమం కోసం ఫ్లై ఓవర్ నిర్మిస్తున్నామని, అందుకు కొందరు త్యాగం చెయ్యక తప్పదని ఎమ్మెల్యే నాని అన్నారు. అయితే నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఆఫ్‌లైన్‌లో ధాన్యం అమ్మిన రైతులకు నగదు చెల్లింపు



ఆఫ్‌లైన్ ద్వారా ధాన్యం అమ్మిన రైతులకు నగదు చెల్లిస్తున్న తహసీల్దార్ భరత్‌రెడ్డి

పామర్రు: గతంలో ప్రభుత్వం ఆన్‌లైన్ నిలుపుదల చేసిన సమయంలో ఆఫ్‌లైన్ ద్వారా ధాన్యం అమ్మకాలు జరిపిన రైతులకు నగదు చెల్లిస్తున్నట్టు పామర్రు తహసీల్దార్ వి.వి.భరత్‌రెడ్డి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆఫ్‌లైన్ రైతులకు నగదు బుధవారం చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఫ్‌లైన్ ద్వారా ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా మిల్లర్లకు అమ్మిన రైతులకు నగదు చెల్లింపులను ప్రాధాన్యతాక్రమంలో నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రస్తుతం కొందరు రైతులకు సుమారు రూ.6 లక్షల వరకు నగదు చెల్లించినట్టు చెప్పారు. ఆఫ్‌లైన్ ద్వారా ధాన్యం అమ్మిన రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, అందరికీ ప్రభుత్వం నుంచి నగదు వస్తుందని అన్నారు. కార్యక్రమంలో మిల్లరు వెన్నా శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది రాము, రైతులు పాల్గొన్నారు.

పేదల ఇంటి కల సాకారం

- ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ
- జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇంటి నిర్మాణాల పరిశీలన



కైకలూరు గ్రీన్ విలేజ్‌లో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో కలిసి జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 ఎకరాల భూమిని సేకరించి జగనన్న గ్రీన్ విలేజ్‌లో 3000 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. తక్కువ ఖర్చుతో నూతన టెక్నాలజీతో ఇంటి నిర్మాణాలకు ఆర్త సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. సంస్థ నిర్మించిన మోడల్ గృహాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రీన్ విలేజ్‌లో అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించామని చెప్పారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంత అభివృద్ధికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే డీఎన్నార్ ఎంతో కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి పేదవానికీ ఇంటి పట్టాలు అందించడమే కాకుండా నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందిస్తుందని చెప్పారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందని కితాబిచ్చారు. కార్యక్రమంలో దూలం వినయ్‌కుమార్, లబ్ధిదారులు, ఆర్త నిర్మాణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.


ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్‌ల పంపిణీ



కూచిపూడి రైతు బజార్‌లో ఓఆర్ఎస్‌లు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కూచిపూడి(మొవ్వ): ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సాధ్యమైనంత వరకు ఇళ్లకే పరిమితమవ్వాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని మొవ్వ మండల వైద్యాధికారి ఎం.వేదరాజ్ సూచించారు. కృష్ణాజిల్లా డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు మొవ్వ మండలం కూచిపూడి గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో, రైతు బజార్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసి, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. వడదెబ్బ తగిలినప్పుడు బాధితులను చల్లని ప్రదేశానికి తరలించి గాలి తగిలే విధంగా ఉంచి, ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కె.దివ్య, ఆరోగ్యకార్యకర్త కె.రామాంజనేయులు, పి.పద్మకుమారి, రైతుబజార్ సూపర్‌వైజర్ పడవల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

గుడివాడటౌన్: రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు దృష్టిలో ఉంచుకుని కార్మికుల ఆరోగ్యంపై యజమానులు శ్రద్ధ చూపాలని కార్మిక శాఖ సహాయ కమిషనర్‌లు వి.చక్రధర్, ఎం.రాజేష్ బాబు అన్నారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న భవనాలు, చిన్నతరహా పరిశ్రమలలో కార్మికులకు యాజమాన్యాలు కల్పిస్తున్న వసతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఎండ తీవ్రత కారణంగా కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, మజ్జిగ పంపిణీ చెయ్యాలని ఆదేశించారు. ఎండ ప్రభావం ఎక్కువగా లేని సమయాల్లో పనులు నిర్వహించాలని తీవ్రంగా ఉన్న సమయంలో పనులు నిలుపుదల చెయ్యాలని వారు సూచించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచాలి



తయారు చేసిన వాటిని చూపిస్తున్న చిన్నారులు

గుడివాడటౌన్: చిన్నారుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగ పడతాయని పేపర్ క్రాఫ్ట్ నిపుణులు రవితేజ అన్నారు. స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా పేపర్ ద్వారా అనేక ఆకర్షణీయమైన బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో పలు అంశాలు చిన్నారులకు నేర్పుతున్నామని, వారు చక్కగా అర్థం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు టి.ప్రవల్లిక, వి.సునీత, చిన్నారులు పాల్గొన్నారు.

సీపెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

మండవల్లి: విజయవాడలోని భారత ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ టెక్నాలజీ (సీపెట్) 2023–24 విద్యా సంవత్సరానికి డిప్లమో, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఓబీసీ, జనరల్ విద్యార్థులకు రూ.500 ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించి ఈ నెల 28 లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

నేడు మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో వలంటీర్లకు ఇంటర్వ్యూలు

మొవ్వ: మొవ్వ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ తెలిపారు. మొవ్వ, చినముత్తేవి, కాజ, కూచిపూడి, పెడసనగల్లు గ్రామాల్లో ఖాళీగా ఉన్న 10 పోస్టులకు 10 మంది దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుదారులు సకాలంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

రెవెన్యూ శాఖ నీటి తీరువా వసూలు చేయాలి

పామర్రు: రాష్ట్రంలో 2022–23 వ సంవత్సరానికి (1432వ ఫసలీ) నీటి తీరువా వసూళ్లు వెంటనే ప్రారంభించాలని సామాజిక కార్యకర్త జె.శ్రీనివాస గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2022 జూలై 1 నుంచి వసూలు ప్రారంభించాల్సిన తీరువా(ఎకరానికి రూ.200) వసూలుకు రాష్ట్ర రెవెన్యూశాఖ ఏపీ సేవా పోర్టల్‌లో చెల్లించేందుకు ఇంత వరకు ఆన్‌లైన్‌లో పొందుపర్చలేదన్నారు. నీటితీరువా శిస్తు రశీదు పుస్తకాలను వీఆర్వోలకు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న పరిస్థితులలో నీటి తీరువా వసూలుకు రాష్ట్ర రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(మంగళగిరి) తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తాను ఈ విషయమై మార్చి 18న లోకాయుక్తకు ఫిర్యాదుచేయగా, లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి దీనిపై నివేదిక ఇవ్వవలసిందిగా రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శికి ఉత్తర్వులు జారీచేశారన్నారు.

ఆటలతో చిన్నారుల్లో సృజనశక్తి పెరుగుదల

జమీగొల్వేపల్లి(పామర్రు): ఆటల పోటీల వలన చిన్నారులలో సృజనశక్తి పెంపొందుతుందని శాఖా గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. క్యారమ్స్, చెస్, లూడో, వైకుంఠపాళి, బిజినెస్ వంటి ఆటల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటల పోటీలకు న్యాయనిర్ణేతలుగా గుమ్మడి ఉషాదేవి, పాటిబండ పద్మావతి వ్యవహరించారు. పోటీలలో ఉత్తమప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

చలివేంద్రాలు ప్రారంభం



కైకలూరు: మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి దాతలు చలివేంద్రాల ఏర్పాటు చేస్తున్నారు. కైకలూరు రైల్వే స్టేషన్‌లో లావేటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని అధ్యక్షుడు లావేటి వీర శివాజీ బుధవారం ప్రారంభించారు. శ్యామలాంబపురం గ్రామానికి చెందిన మహమ్మద్ బాబ్జి సహకారంతో మెయిన్ రోడ్డు సమీపంలో హైటెక్ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు

కైకలూరు: వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా బుధవారం కైకలూరు గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఆర్.రాఘవులు ఆధ్వర్యంలో చిన్నారులతో నీతి కథలు చదివించారు. కలిదిండి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో సామాజిక సేవకుడు లావేటి శివాజీ స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను వివరించారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అంశంపై చిత్రలేఖనం పోటీ నిర్వహించారు.